# ‘నాకొక్కంచెం నమ్మకమివ్వు’

నాకొక్కంచెం నమ్మకమివ్వు
సూదిమొన మోప తావు మిగల్చను
నాదగు బాహుబంధనంలో
విశాల భూభాగాన్ని చాపలా చుట్టేస్తాను

నాకొక్కంచెం నమ్మకమివ్వు
ఓటర్లయిన ప్రజలను ఓడిస్తాను
నాదగు కబంధహస్తాల్తో
ప్రజాస్వామ్యాన్ని సెంబర్ గేమ్ ఆడిస్తాను

నాకొక్కంచెం నమ్మకమివ్వు
జనజీవన ప్రవంతిని అవినీతీకరిస్తాను
నావగు నూతనవిలువల్లో
అఖిలాంధ్రను ముంచితీస్తాను

నాకొక్కంచెం నమ్మకమివ్వు
దొడ్డమనసున దొడ్డుబియ్యం అందజేస్తాను
నాదగు నవీనమార్గంలో
ఆరోగ్యసూత్రాలు ఆవిష్కరిస్తాను

నాకొక్కంచెం నమ్మకమివ్వు
దేవుడినీ కేంద్రాన్నీ ఆటాడిస్తాను
నాదగు వ్యూహచట్రంలో
అందర్నీ గింగిరాలెత్తిస్తాను

నాకొక్కంచెం నమ్మకమివ్వు
ఆ రెండుపత్రికల్ని ఉతికారేస్తాను
నాదగు కార్యదీక్షతో
నాలుగు స్థంభాలతో ఆటాడుకుంటాను

నాకొక్కంచెం నమ్మకమివ్వు
చౌడప్పనై చెలరేగుతాను
నాదగు వాచాలతతో
సభ‘సాక్షి’గా సభ్యతను సమాధిచేస్తాను

నాకొక్కంచెం నమ్మకమివ్వు
నాజీవన పథాన్ని ఆంధ్రీకరిస్తాను
నాదగు నిర్భయత్వంతో
తెలుగుజాతికి తెగులు పట్టిస్తాను

(ఆలూరి బైరాగికి క్షమాపణలతో... రాష్ట్ర పాలకుడి స్ఫూర్తితో...)

- శ్రీశైల్‌రెడ్డి పంజుగుల, సామాజిక కార్యకర్త